# సీనుగాడి అమ్మ

చెరకు తోటకీ చెరువుగట్టు మధ్యనుంచి సిమ్మాద్రి పరిగెట్టుకుంటూ వెళ్తూ అరుస్తున్నాడు–

"సిన్నమ్మో... సీనుగాడు కొంపముంచేసాడు. తాడిచెట్టు మీదనుంచి పడిపోయాడు...."

"అయ్యో అయ్యో... నా బిడ్డా! నా నాయనో" అంటూ ఎదురొచ్చింది సిన్నమ్మ.

"బిడ్డ ఏడుస్తున్నాడా.. ఎలా వున్నాడ్రా" ఏడ్పూ కంగారు కలసిన ఆందోళనతో కుప్పకూలింది తోవ నడిమధ్యలో– సిమ్మాద్రి ఊరుకోబెట్టాడు.

"రెడ్డిగారు ట్రాక్టర్ మీద హాస్పటేలుకి తీసుకెళ్లారు"

"బతికి ఉన్నాడా? పేనం ఆడుతోందా"

"తలకి గట్టి దెబ్బే తగిలింది..."

"దేవుడా... నా పేనం తీసుకు ఆణ్ని వదిలేసెయ్.. తండ్రీ"

చిన్నమ్మని ఓ రిక్షా ఎక్కించి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తున్నాడు– దారి పొడుగుతా ఆవిడ గుర్తొచ్చిన ప్రతీ దేవుడికీ ఆర్తిగా మొక్కులూ ముడుపులూ కడుతోంది. సిమ్మాద్రికి ఓదార్చడం చేతకావట్లేదు.

అసలే చిన్నమ్మ ప్రాణం అంతంతమాత్రంగా వుంది.

గుండెల్లో గొట్టం వేసి.. పరీక్షలు గట్రా చేసారు.

కొన్నాళ్లు పట్నంలో పెద్దాసుపత్రిలో ఉండాలంటున్నారు.. అందుకు కనీసం 50వేలు ఖర్చు అవుతుందన్నారు.

ఎక్కణ్ణుంచి అంత డబ్బు పోగేస్తాడు.

"ఎప్పటికి అప్పు తీరుస్తా"వంటే.. తెల్లమొహం వేస్తున్నాడు. సీనుగాడికి చేతనైన పని అల్లా తాటిచెట్టెక్కడం–

కల్లు తీసుకుని దుకాణాలకి పొయ్యటం–

మెట్టమీద ఐదారు చెట్లు తండ్రి నుంచి వారసత్వంగా వచ్చాయి వాడికి! సీనుగాడి తండ్రి మునసబుగార్ని మంచి చేసుకుని ఆ చెట్లు తన కిప్పించుకున్నాడు. ఆ పక్కల్నే ఇంకో నాలుగు చెట్లు లేచాయి గానీ..

అవింకా మనిషెత్తు కూడా అవలేదు.

"ఒరే సిమ్మాద్రీ.. నా చెట్లు ఏ దుకాణంవాడైనా పెట్టుకుని సొమ్ము సద్దితే.. నేను బతికుండేంత వరకూ వాడికి ఊరికే పని చేస్తారా- అమ్మను సూత్తో సూత్తో అట్టా వదల్లేను- అది సస్తే నేను బతకలేన్రా" అంటూ ఈ మధ్య సిమ్మాద్రితో చాలాసార్లే ఏడుస్తూ అనేవాడు.

సిమ్మాద్రి "దేవుడంతా మంచిగానే నడిపిస్తాడ్రా- నువ్ బెంబేలుపడకు"

పైవూళ్లో పెద్ద దుకాణాలకి కూడా వెళ్లాడు- బేరం చెప్పాడు- "మా దుకాణాలే ఈ ఆడంగులు ఎన్నాళ్లుండనిస్తారో తెలీదు- అమావాస్యకీ పున్నానికీ కల్లు సారాల్దుకాణాలపై గొడవలు చేస్తారు. నీకూ తెల్సుగా? అయినా మా వూరు చెట్లు మాకు ఉజ్జాయింపుగా సరిపోతాయి" అన్నారు వాళ్లు.

"ఏ చెట్టుమీంచో దూకేసి నేను సస్తే పీడాపోతుంది. కానీ అమ్మ గుండె పగిలి సత్తుందిరా.. సిమ్మాద్రీ.." అన్నాడు శీను.

"ఏడిశావు.. ఎవరికోసం ఎవరూ బతకలేర్రా.. అలాగే సావాలేరు.. ఎవరి టయామొస్తే ఆళ్లు పోతారు.."

"......"

"నువ్వింకా ఇలాంటి పిచ్చి ఆలోచన్లు సేత్తున్నావని మీ అమ్మకి తెలిస్తే... నీ కళ్లముందే... సెరువులో దూకి సస్తుంది" బెదిరించాడు సిమ్మాద్రి.

మరింతసేపు ధైర్యం చెప్పాడు.

ఓ రెండ్రోజులుగా బాగానే ఉన్నాడు.

అప్పుకోసం అక్కడికీ ఇక్కడికీ వెళ్లొస్తున్నాడు.

ఇవ్వాళ మళ్లీ ఏమైందో అన్నంత పనీ చేశాడు.

✦ ✦ ✦

దారిపొడుగూ చిన్నమ్మ పడుతున్న టెన్షనింతా అంతా కాదు– సీనుగాడు చిన్నప్పుడు ఆటల్లో పరిగెడుతూ పడి ఏడిచాడట. కొంచెం రక్తం వచ్చింది. అప్పుడీమె చిన్న తిరుపతి వస్తానని మొక్కుకుందిట... వెల్లిందట... వీడికి పెళ్లయితే పెద్ద తిరుపతి మొక్కు ఉందిట.

"ఇంతలో ఇదేంట్రా దేవుడా" అని లబోదిబోలాడుతోంది.

"ఊరుకో సిన్నమ్మా దేవుడు వాడికి అన్యాయం చెయ్యడు... నిన్ను దగా చెయ్యడు"

"పెళ్లి చేసుకోరా నాయనా.. అంటే ఆ వొచ్చేది ఎలాటిదో... నిన్ను బాగా చూసుకుంటుందా... అంటాడు. వచ్చే పిల్ల తాళి గట్టిదైతే ఇలాంటి గండాలు గట్టెక్కి ఉండేవి... నా ఎదవ మొహానికి ఇంకెన్ని ఇబ్బందులు రాశాడో..." జాలి కలిగించేలా వుంది ఆవిడ పరిస్థితి.

ఆసుపత్రి ముందు రిక్షా దిగారు.

ఏడుస్తున్న చిన్నమ్మ చుట్టూ గుమిగూడారు తమ గూడెం వాళ్ళూ తెల్సున్నవాళ్ళు–

"ఎలా వున్నాడు"

"మూలుగుతున్నాడు– నెప్పి తెలుస్తుంటే పేనం గండం తప్పిందనే అనుకోవాలి..."

లోపలికి వెళ్లబోతున్న చిన్నమ్మను ఓదార్చుతూ... "పెద్ద డాక్టరుగారు కట్టుకడుతున్నారు... వాళ్లు పిల్చినప్పుడే ఎల్లాలట– కేకలేత్తున్నారు"

కొంగు గొంతులో పెట్టుకుని కుళ్లి కుళ్లి ఏడిచింది.

సిమ్మాద్రి ఓ గోలీసాడా తెచ్చి "మొహం కడుక్కుని ఓ సుక్క గొంతు తడుముకో స్థిమితపడతావు" అన్నాడు.

"వాడిని చూసేవరకు, వాడితో మాట్లాడేవరకు నా ప్రాణానికి స్థిమితం వుండదు రా..."

✦ ✦ ✦

చిన్నమ్మ అదృష్టం బావుంది! కొడుకు మాట్లాడగల్గేడు.

"ఇన్నేళ్ళ నుంచి తాటిచెట్టు ఎక్కుతున్నావురా! ఇంత ప్రమాదం ఎలా జరిగింది? కళ్లు తిరిగేయా? పగ్గం జారిందా?" ఏడుస్తూ ఆందోళన పడుతున్న తల్లి మాటలకి, శీనుగాడు సింహాద్రి మొహమొహాలు చూసుకుంటున్నారు.

"రెండ్రోజులు మీ అమ్మ పచ్చి మంచినీళ్లు గొంతులో పోసుకోలేదురా! కళ్లంపట నీళ్లు ఆగలేదు..." అని సింహాద్రి చెబుతుంటే.. తట్టుకోలేక బొటబొట కళ్ళంపట నీళ్లు రాలాయి శీనుగాడికి.

"అమ్మా" అంటానికి నోరు పెగలలేదు... మెదడుకి, గెడ్డానికి కలిపిన కట్టువల్ల-

తల్లికేసే చూస్తూ....

'నేను చనిపోతే అమ్మ బ్రతకగలదా! అందుకే నేను చావకూడదు. అమ్మకి ఏదైనా అవుతే నా గుండె నిలుస్తుందా? టప్మని ఆగిపోదూ! ఆస్పత్రి ఖర్చు దొరక్కపోయినా అమ్మ కొన్నాళ్లుంటుంది! అదే చాలు. అంతవరకు అమ్మని ఆనందంగా ఉంచుదా'మని.. అనుకున్నాడు.

శీనుగాడి కళ్ళలో ఆ నిర్ణయం సింహాద్రి చదివేడు- అతని కళ్ల నుంచి నీళ్లు పొంగేయి-